క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

భీమిని: విద్యుత్ సమస్య పరిష్కరించాలని వినియోగదారులు బుధవారం సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై ధర్నా చేపట్టడంతో అధికారులు స్పందించారు. కన్నెపల్లి మండల కేంద్రంలో గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య పరిష్కరించారు. విద్యుత్ శాఖ డీఈ రాజన్న, ఏడీఈ రవికుమార్, ఏడీ రాజనర్సులు గ్రామాల్లోకి వెళ్లి వినియోగదారులతో మాట్లాడారు. దహెగాం సబ్‌స్టేషన్ పరిధి నుంచి మాడవెల్లి, ఐదపల్లి, షాలిగాం, బొత్తపల్లి, తంగళ్లపల్లి గ్రామాలు కన్నెపల్లి సబ్‌స్టేషన్లో కలిశాయన్నారు. ఇక నుంచి విద్యుత్ అంతరాయం కలుగకుండా నిరంతర విద్యుత్ అందజేస్తామని తెలిపారు. విద్యుత్ సమస్య ఏదైనా ఉంటే సబ్‌స్టేషన్‌లో సంప్రదిస్తే పరిష్కరిస్తామని సూచించారు.

భూ కబ్జా అడ్డగింత

జైపూర్: భీమారం మండలం పోతన్‌పల్లి గ్రామంలో గొల్లవాగు ప్రాజెక్టు నిర్మించారు. పోతన్‌పల్లి గ్రామ ప్రాజెక్టులో ముంపునకు గురికాగా, పోతన్‌పల్లి గ్రామానికి చెందిన గ్రామస్తులకు ఇదే గ్రామంలో నిర్వాసితులకు భూమి, ఇంటి స్థలాలు కేటాయించారు. ఓ మహిళ పేరు చెప్పి రెండు గుంటల భూమి కేటాయించాలని ఓ కాంగ్రెస్ నాయకుడు మంత్రి వద్దకు వెళ్లి వినతిపత్రం అందించగా, ఆయన ఆ వినతిపత్రాన్ని స్థానిక రెవెన్యూ అధికారులకు పంపించారు. రెవెన్యూ అధికారులను ఆ నాయకుడు తప్పుదారి పట్టిస్తూ భూ కబ్జాకు యత్నించగా గ్రామస్తులు ఆ కబ్జాను అడ్డుకున్నారు. కాగా రెవెన్యూ అధికారులు మాత్రం తాము ఎవరికి భూమి కేటాయించలేదని, దానిపై విచారణ చేయనున్నట్లు తెలిపారు.

ప్రయోగాత్మక బోధన చేయాలి

దండేపల్లి: సైన్స్ పాఠాలను ప్రయోగాత్మక బోధన చేయాలని ఎంఈవో చిన్నయ్య అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారం మండలాల భౌతిక శాస్త్ర కాంప్లెక్స్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ అప్పాల మనోహర్, మూడు మండలాల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటగదిని, గ్రామంలోని పారిశుద్ధ్య పనులను, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో సరోజ గురువారం పరిశీలించారు. గ్రామంలోని ప్రజలకు పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలని, పాఠశాల విద్యార్థులకు మంచి రుచికరమైన భోజనం అందించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. వీధుల్లో పారిశుద్ధ్యం లోపిస్తే బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలన్నారు. అనంతరం గ్రామంలోని వార్డులను తిరిగి చూశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ, దుర్గాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

లక్సెట్టిపేట: జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఆగస్టు నెలలో హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని భవనంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏకపక్ష రోస్టర్ విధానంలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నీట్‌లో ఉద్యోగ ప్రమోషన్, మెడికల్ సీట్లు, ఇంజనీరింగ్‌లలో రోస్టర్ విధానాన్ని ఆపివేసి జీవో 99ని రద్దు చేయాలని కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించే సమావేశం తేదీని త్వరలోనే నిర్ణయిస్తామని, ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తొగరు సుధాకర్, శంకర్, కనకరాజు, బెంజిమన్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గరిసె రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోటపల్లి: పొగాకు వ్యతిరేక దినోత్సవ కార్యక్రమం సందర్భంగా దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. విద్యార్థులు పొగాకు ఉత్పత్తులు ధూమపానానికి దూరంగా ఉండాలని హెచ్ఎం సయింపు శ్రీనివాసరావు సూచించారు. విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే నష్టాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. ప్రయాణికుల చింత



జన్నారం: నిత్యం పర్యాటకులతో కళకళలాడే రోడ్డు గుంతలమయం అయ్యింది. మండల కేంద్రంలో గల హరిత రిసార్ట్‌కు వెళ్లే రోడ్డు గుంతలు ఏర్పడి, గుంతల్లో నీరునిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది. రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ రోడ్డు పొనకల్, జన్నారం గ్రామ పంచాయతీల మధ్య ఉన్నందున రెండు గ్రామ పంచాయతీలు పట్టించుకోవడం లేదు. అధికారులు, పంచాయతీ సిబ్బంది దృష్టి సారించి, రోడ్డుకు మరమ్మతు చేయించాలని పర్యాటకులు కోరుతున్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల



భీమిని: మండల కేంద్రంలోని పశు వైద్యశాల శిథిలావస్థకు చేరింది. 28సంవత్సరాల క్రితం ఈ భవనాన్ని నిర్మించగా, పెచ్చులూడి వర్షాలకు స్లాబు పూర్తిగా ఉరుస్తోంది. ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. పశు వైద్యశాల ఎదుట పిచ్చి మొక్కలతో పాటు బురదమయంగా మారడంతో పశువులు తీసుకురావడానికి పశు పోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనానికి మరమ్మతు చేపట్టాలని పశు పోషకులు కోరుతున్నారు.

పగుళ్లు తేలిన గోడలు.. భయంగా విధులు



చెన్నూర్: చెన్నూర్ మండల వనరుల కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలం వచ్చిందంటే అధికారులు, సిబ్బంది భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలో సీఆర్పీలతో పాటు 8మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. భవనం నిర్మించి సుమారు 30ఏళ్లు అవుతుండగా, ఎలాంటి పిల్లరు లేకుండా గోడలపై స్లాబ్ వేశారు. దీంతో 60శాతం భవనం పగుళ్లు తేలింది. భవన దుస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు ఎంఈవో రాధాకృష్ణమూర్తి తెలిపారు.

రోడ్లపై పశువుల తిష్ట..!



జాతీయ రహదారిపై తిష్టవేసిన పశువులు

- వాహనదారులకు తప్పని తిప్పలు
- తరుచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- సమస్య అత్యంత జటిలం..
- చర్యలు తీసుకోవడమే ఉత్తమ మార్గం

రామకృష్ణాపూర్: రోడ్లపై ఎక్కడికక్కడ తచ్చాడుతున్న పశువులు.. ఒక్కోసారి ప్రధాన రహదారుల్లో పడకేయటం.. కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండటం.. ఇవన్నీ పోలీస్‌శాఖకు ఒక విధంగా చికాకులు, సమస్యలు కొని తెచ్చేవి. అయితే ఈ పశువుల పనిపట్టాలని, వీటికి కళ్లెం వేయాలని మున్సిపల్ అధికారులు, అటు పోలీస్ అధికారులు సంయుక్తంగా జాయింట్ ఆపరేషన్‌కు సన్నద్ధం అయినప్పటికీ పశువులను పట్టే వారిని రప్పించి గోశాలకు తరలించటంలో మాత్రం తీవ్ర తాత్సారం జరుగుతోంది.

- క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో పశువుల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు రోజురోజుగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట విధులు నిర్వర్తించే సింగరేణి కార్మికులకు, వాహన చోదకులకు ఇష్టారాజ్యంగా తిరుగాడే పశువులు పెద్ద సవాలుగా మారాయి. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన కూడా ఒకింత పట్టిపీడించే అవకాశాలు లేకపోలేదు. మంచిర్యాల –నాగ్‌పూర్ జాతీయ రహదారి ప్రధాన మార్గంలోని గద్దెరాగిడి , అమ్మాగార్డెన్స్ ప్రాంతంలో కొద్ది రోజులుగా ప్రధాన రహదారిపైనే పశువులు యథేచ్ఛగా తిరగటమే కాకుండా, నడిరోడ్డుపైనే సేదదీరుతుండటంతో వాహన ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి. వేగంగా వస్తున్న పెద్ద వాహనాలు తగిలి అటు మూగజీవాలు కూడా మృత్యువాతపడుతున్నాయి. ఇక కోల్‌బెల్ట్ రహదారి అయిన ఆర్కే1 ఏరియాలోనూ మూగజీవాల సంచారం ఎక్కువైంది. గుంపులు గుంపులుగా తిరగటం పైగా రోడ్ల మీదే తిష్టవేస్తుండటంతో రాత్రిపూట విధులకు వెళ్లే కార్మికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రమాదాల దృష్ట్యా పోలీస్, మున్సిపల్ శాఖ అధికారులు స్పందించి సంయుక్త ఆపరేషన్‌కు ఇటీవల సిద్ధమైనప్పటికీ పశువులను పట్టేవారు లేక ఈ ప్రక్రియ ముందుకు సాగటం లేదు. ఫలితంగా పశువుల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

పట్టించుకోని యజమానులు..

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రధాన కూడళ్లలో పశువులను రోడ్లపైకి వదిలి యజమానులు తమను ఎవరేం చేస్తారన్న దీమాతో వ్యవహరిస్తున్నారు. పశువులను రోడ్లపైకి వదలకుండా ముందుగా యజమానులను కట్టడి చేయాల్సినా, సంబంధిత అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకునే పరిస్థితి కనిపించటం లేదు. దీంతో మందలు మందలుగా పశువులు రోడ్లపైనే ఉంటూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అటు పోలీస్ శాఖ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టి పశువులను పట్టణ ప్రాంతం నుంచి గోశాలకు తరలించేలా సత్వర చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. తద్వార అనివార్యంగా తలెత్తే రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

పశువులను పట్టేవారిని రప్పిస్తాం



మున్సిపాలిటీ పరిధిలో పశువుల సమస్య ఇటీవల ఎక్కువైంది. పశువులను పట్టేవారిని రప్పించి త్వరలోనే వాటిని గోశాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటాం, ఆంబోతులను పట్టాలంటే అందరితో కాదు. వాటిని పట్టే వారే రావాలి. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. పోలీసులతో కలిసి సంయుక్తంగా పశువులను నివారిస్తాం.

– జి.రాజు, మున్సిపల్ కమిషనర్

వైద్యసేవలందించడంలో అలసత్వం వద్దు



రికార్డులు పరిశీలిస్తున్న సుధాకర్‌నాయక్

తాండూర్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని బెల్లంపల్లి డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీలో రోగులకు సంబంధించిన రిజిస్టర్లు, ల్యాబ్, మందుల స్టాక్ తదితర అంశాలను పరిశీలించారు. వార్డులు తిరిగి చూశారు. పీహెచ్‌సీ ఆవరణలో పరిసరాల పరిశుభ్రతను గమనించారు. రోజువారీగా వైద్యులు, సిబ్బంది విధులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్లు ఝాన్సీరాణి, జయమేరి, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు రమాదేవి, తార, ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నారు.

కాల్‌టెక్స్‌లో వైద్య ఆరోగ్య శిబిరం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ కాల్‌టెక్స్ ఏరియాలో గురువారం ఇంటిగ్రేటెడ్ వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని బెల్లంపల్లి డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నివారణకు ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. రెండు వారాలకు పైగా దగ్గు ఉన్నట్‌లైతే తెమడ పరీక్ష చేయించుకోవాలని, ఈ పరీక్ష ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తారని తెలిపారు. వ్యాధి ఉన్న రోగులకు ఉచితంగా మందులు అందజేస్తారని సూచించారు. సత్వరంగా వైద్య పరీక్షలు చేయించుకొని, ఆరోగ్యాన్నీ మెరుగు పర్చుకోవాలని కోరారు. శిబిరంలో వైద్యులు సుచరిత, శిరీష, వైద్య ఆరోగ్యసిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్ చక్రపాణిని సన్మానిస్తున్న అధ్యాపక బృందం

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వంగ చక్రపాణిని గురువారం ఘనంగా సన్మానించారు. కళాశాలలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించగా అధ్యాపకులు, సిబ్బంది పూలమాలలతో సన్మానించారు. 33సంవత్సరాలుగా ఉద్యోగ ప్రస్థానంలో అధ్యాపకుడిగా, ప్రిన్సిపాల్‌గా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూర్ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు నరేందర్‌రెడ్డి, శంకర్, సంతోష్, పట్వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సరిపడా ఎరువుల నిల్వలు



రిజిస్టర్లు తనిఖీ చేస్తున్న డీఏవో ఛత్రునాయక్

మంచిర్యాలఅగ్రికల్చర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతుల అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని, సొసైటీ, ఫెర్టిలైజర్ డీలర్లు ఎరువుల నిల్వ వివరాలు ప్రతీ రోజు దుకాణం ఎదుట పొందుపర్చాలని జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్ అన్నారు. గురువారం మంచిర్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార శాఖ కార్యాలయం, ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలు, హాజీపూర్‌మండలంలోని ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మంచిర్యాల ఏడీఏ అనిత, ఏవో టి.మహేందర్ పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

- జిల్లా వైద్యాధికారి హరీష్‌రాజ్



వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

లక్సెట్టిపేట: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరీష్‌రాజ్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. రోగులకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి రాపిడ్ ఫీవర్ సర్వే యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకొని, ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రికార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాస్‌మీడియాధికారి వెంకటేశ్వర్లు, వైద్యాధికారి సతీష్, శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

'సమయం, జీవితం చాలా విలువైనది'



మాట్లాడుతున్న సాయికిరణ్

లక్సెట్టిపేట: మానవ జన్మలో సమయం, జీవితం చాలా విలువైనదని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కాసమల సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులకు పోక్సో, డ్రగ్స్, గంజాయి లాంటి వాటిపై అవగాహన కల్పించి చట్టరీత్యా తీసుకునే చర్యలపై వివరించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు కొమ్మిరెడ్డి సత్తన్న, కార్యదర్శి ప్రదీప్, ఏజీపీ సత్యం, న్యాయవాదులు కారుకూరి సురేందర్, అక్కల శ్రీధర్, గడికొప్పుల కిరణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల గైర్హాజరుతో ఉత్పత్తికి విఘాతం

రామకృష్ణాపూర్: ఉద్యోగుల గైర్హాజరు కారణంగా ఏరియాలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాధించలేకపోయామని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై మాసానికి గాను మందమర్రి ఏరియాకు లక్ష 24వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశిస్తే, అందులో 62శాతం ఉత్పత్తిని సాధించామని తెలిపారు. కేకే–5 గనిలో 100శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్ గనుల్లో ఉద్యోగుల హాజరు శాతం తక్కువగా ఉంటున్నందునా, అనుకున్న ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించలేకపోతున్నామని గైర్హాజరు శాతాన్ని తగ్గించగలిగితే సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

సమాచారం

చెన్నూర్ ఎంఈవోగా దత్తకుమార్



చెన్నూర్: చెన్నూర్ మండల విద్యాధికారిగా మహవాది దత్తకుమార్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోను సిబ్బంది బెల్లంకొండ రాకేశ్, లావణ్య, నాగేశ్వర్‌రావు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

5న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన

దండేపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆగస్టు 5న మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బండెల రవిగౌడ్ తెలిపారు. ఆయన పర్యటనను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పర్యటనపై దండేపల్లిలో పార్టీ కార్యాలయంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. లక్సెట్టిపేటలోని శివాజీ చౌక్ సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్లో సభ ఉంటుందని తెలిపారు. సభకు మండలంలోని ప్రతి బూత్ నుంచి వందమంది కార్యకర్తలకు తగ్గకుండా తరలిరావాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం గంగారం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 112మందికి వైద్య పరీక్షలు చేశారు. జ్వరం ఉన్న వారికి మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ ఉమారాణి, ఏఎన్ఎం గాయత్రి, ఆశా కార్యకర్త అరుణ పాల్గొన్నారు.

తాండూర్: మండలంలోని మాదారంటౌన్‌షిప్‌లో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, ఆశ కార్యకర్తలు మల్లేశ్వరి, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

- **బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి**

చెన్నూర్: బీసీలకు స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ తుమ్మ రమేశ్, కొండపర్తి వెంకటరాజం, కొప్పుల రవీందర్, జడల మల్లేశ్, నాయబ్, హరిలు పాల్గొన్నారు.

- **ఆర్థిక భద్రత బీమాపథకాలపై అవగాహన**

కోటపల్లి: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కోటపల్లి ఆధ్వర్యంలో మండలసమాఖ్యలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక భద్రత, బీమా, పెన్షన్ పథకాలపై బ్యాంక్ మేనేజర్ రాజేశ్ అవగాహన కల్పించారు. అనంతరం పాయిరాల మల్లయ్యకు జీవన్ సురక్ష బీమా పథకంలో మంజూరైన రూ.2లక్షల చెక్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు.

- **అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

మంచిర్యాలటౌన్: మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని పాత మంచిర్యాల, రంగంపేట్‌లలో గురువారం డీఎంఎఫ్‌టీ నిధులు రూ.18లక్షలతో రోడ్లు, డ్రెయినేజీ పనులకు తాజా మాజీ ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బొలిశెట్టి సునిత, బొలిశెట్టి కిషన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, ఎర్ల మల్లేశ్, జక్కుల కుమార్, పాయిలి అర్జున్, ఆసరి పోశం, మేకల శేఖర్, ఆసరి సంపత్, రేఖల సంతోశ్, కనక మల్లేశ్, కాయితి నరేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **రైతులకు పెసర విత్తనాలు పంపిణీ**

తాండూర్: మండలంలోని చౌటపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయ అధికారులు పంటల క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా రైతులకు పంటల సాగులో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తనం, రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా పలువురు రైతులకు వరి, పెసర విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుష్మ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శంకర్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

- **రిలే దీక్షలకు రిటైర్డ్ ఎంప్లాయీస్ మద్దతు**

జన్నారం: జన్నారం మీదుగా భారీ వాహనాల రాకపోకల నిషేదంపై నిరసిస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు గురువారం మండల రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో సామాజిక వేత్త భూమాచారి, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నాగేశ్వర్, సత్యనారాయణ, నాగభూషణం, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- **రైతు రిజిస్ట్రీ తప్పక చేసుకోవాలి**

వేమనపల్లి: పీఎం కిసాన్ జమ అవ్వాలంటే రైతుకార్డు తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి వీరన్న అన్నారు. మండలంలోని ముల్కలపేటలో గురువారం ఏఈవో హెప్సిబాతో కలిసి ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతు రిజిస్ట్రీ చేసుకొని రైతులు, పట్టాదారులు ఎవరైతే ఉన్నారో తమ ఆధార్‌కార్డు, ఓటీపీ వచ్చే ఫోన్ నంబర్‌తో స్థానిక ఏఈవోల వద్దకు వెళ్లాలన్నారు.

- **పౌరహక్కుల సమావేశం**

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరు తొమ్మిదో వార్డులో వివిధ శాఖల అధికారులు గురువారం పౌరహక్కుల సమావేశం నిర్వహించారు. కా ర్యక్రమంలో రెవెన్యూ డీటీ శ్రావణి, గిర్దావర్ సునీ త, ఏఈ అబ్రహం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమ త, మున్సిపల్ సిబ్బంది రాజయ్య, ఏఎస్ఐ సుధాకర్ కానిస్టేబుల్ రాజమౌళి, నాయకులు రవికుమార్, దర్శనాల నవీన్, విక్రమ్, సతీశ్ పాల్గొన్నారు.

- **విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు**

దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గతేడాది ఫలితాల్లో తరగతుల వారీగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. వీటిని బిగ్‌హెల్ప్ ఆధ్వర్యంలో తెన్నేటి అవార్డ్‌ఫర్ ఎక్సలెన్స్ పేరుతో అందించారు. పాఠశాల హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **రేషన్ కార్డులు పంపిణీ**

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు నీల్వాయి రైతువేదికలో మండలానికి నూతనంగా మంజూరైన 713రేషన్ కార్డులను తహసీల్దార్ సంధ్యారాణి, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ అందజేశారు. కార్యక్రమంలో డీటీ సాయికృష్ణ, ఆర్ఐ కాలీక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు లింగాగౌడ్, వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

- **ఉద్ధామ్ సింగ్ వర్ధంతి**

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో సత్యప్రచారక్ సమాజ్ నాయకులు స్వాంతంత్రోద్యమ వీరుడు ఉద్ధామ్ సింగ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సత్య ప్రచారక్ జిల్లా అధ్యక్షుడు మామిడి శెట్టి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి లక్ష్మణ్, సభ్యులు గరిగె విజయ్, సత్యం, యోసేపు పాల్గొన్నారు.